

మెరీనాబీచ్‌లో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు

తీరంలో 'అల'జడి

- సముద్రతీరప్రాంతాల్లో పెనుగాలులు
- చేపలవేటకు వెళ్లొద్దన్న అధికారులు

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి నుంచి పళవేర్కాడు దాకా సముద్రతీరం పొడవునా బుధవారం ఉదయం 'అల'జడి అధికమైంది. కన్నియాకుమారి సముద్రతీరంలో మన్నార్ జలసంధి వద్ద పెనుగాలులు వీయడంతో అలలు ఎగసి పడుతున్నాయి. సముద్రతీర ప్రాంతాల్లోల పెనుగాలులు వీస్తుండటంతో జాలర్లు చేపలవేటకు వెళ్ల కూడదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం వాతావరణంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా అక్కడక్కడా ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. కన్నియాకుమారి సముద్రతీరంలో మన్నార్ జలసంధి వద్ద గంటలకు 45 నుంచి 55 కిమీల వేగంతో పెనుగాలులు వీస్తున్నాయి.



కాశిమేడు తీరం వైపు దూసుకొస్తున్న అలలు

దీంతో జాలర్లు చేపలవేటకు వెళ్ళవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. నగరంలోని మెరీనాబీచ్, పట్టినంబాక్కం బీచ్, తిరువాన్మియూరు బీచ్ తదితర ప్రాంతాల్లో బుధవారం వేకువజాము నుంచే అలల ఉధృతి అధికమైంది. కాశిమేడు చేపలరేవు వద్ద కూడా అలలు తీరం వైపు వేగంగా దూసుకువస్తున్నాయి. తిరునల్వేలి, తెన్‌కాశి, నీలగిరి, కోయంబత్తూరు, చెన్నై, కాంచీపురం, తిరుళ్లూరు ప్రాంతాల్లోనూ చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. బంగాళాఖాతంలో పెనుగాలులతో పాటు అలలు ఎగసిపడుతుండటంతో జాలర్లు చేపలవేటకు వెళ్ళకూడదని అధికారులు హెచ్చరికలు కూడా జారీ చేశారు.



ట్రాక్టర్లకు పచ్చజెండా వూపి ప్రారంభిస్తున్న స్టాలిన్



ట్రాక్టర్లతో లబ్దిదారులు

టార్గెట్ 200

అసెంబ్లీ ఎన్నికల లక్ష్యం

- డీఎంకే శ్రేణులకు స్టాలిన్ లేఖ

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి సహా 40 స్థానాలను కైవసం చేసుకున్న డీఎంకే కూటమి, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 200 సీట్లు గెలవడమే ప్రధానలక్ష్యంగా పెట్టుకుని పార్టీ శ్రేణులు ఇప్పటి నుండే కృషి చేయాలని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఆయన పార్టీ శ్రేణులకు బహిరంగ లేఖ రాశారు. ప్రతియేటా సెప్టెంబర్‌లోనే పెరియార్ జయంతి, అన్నాదురై జయంతి, డీఎంకే ఆవిర్భావదినాన్ని జరపటం పార్టీ ఆనవాయితీగా ఉంటే ఈ యేడాది జూన్ 15న మూడు ఉత్సవాల మహోత్సవం జరపటం ఏమిటా అని పార్టీ శ్రేణులు ఆశ్చర్యపోతున్నట్లు తనకు సమాచారం అందిందన్నారు. సెప్టెంబర్‌లో జరుగునున్న మూడు ఉత్సవాలకు ట్రయల్ రన్‌గా ఈ నెల 15న కోయంబత్తూరు కొడీసియా మైదానంలో డీఎంకే, దాని మిత్రపక్షాలు, పార్టీని గెలిపించిన ప్రజలు కలిసి జరుపుకునే ఉత్సవాలే ముప్పెరుం విళా అని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో మతతత్త్వ శక్తులు చొరబడని విధంగా ప్రజలు చక్కటి తీర్పు ఇచ్చారని, ఆ గెలుపు డీఎంకే ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల అమలుకు లభించినదనే భావిస్తున్నట్లు తెలిపారు. కోయంబత్తూరులో ముప్పెరుంవిళా ముగిసిన తర్వాత పార్టీ శ్రేణులంతా మిత్రపక్షాల కార్యకర్తలు, నేతలతో కలిసి మళ్ళీ ప్రజలవద్దకు వెళ్ళాలని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో 234 స్థానాలకుగాను 200 స్థానాలు డీఎంకే కూటమి గెలుచుకునే దిశగా ఇప్పటి నుండే పార్టీ శ్రేణులు తీవ్రంగా పాటుపడాలని పిలుపునిచ్చారు.

ట్రాక్టర్ల పంపిణీ

సచివాలయం వద్ద బుధవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో యువకులకు ట్రాక్టర్ డ్రైవింగ్ నేర్పేందుకుగాను కొనుగోలు చేసిన ట్రాక్టర్లను ముఖ్యమంత్రి స్టాలిన్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. మన్నుయిర్ కాత్తు మన్నుయిర్ కాప్పోం (మట్టిని కాపాడి మనిషిని కాపాడుదాం) అనే పథకం ద్వారా అన్నదాతలకు తక్కువ అద్దెపై ట్రాక్టర్లను బాడుగకు ఇచ్చే విధానానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ పథకం అమలుకు గాను రూ.232 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రైతులకు భూసారాన్ని పెంచే విధంగా స్వల్పకాలిక పంటలకు మేలిమిరకం విత్తనాలను కూడా ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, పొన్ముడి, ఎంఆర్కే పన్నీర్‌సెల్వం, ఆర్ఎస్ రాజకన్నప్పన్, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ అపూర్వ, వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



విలవంగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే తారగై కత్‌బర్ట్‌చే ప్రమాణస్వీకారం చేయిస్తున్న స్పీకర్ అప్పావు

విలవంగోడు ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా విలవంగోడు నియోజకవర్గం శాసన సభ్యురాలు తారగై కత్‌బర్ట్ బుధవారం ఉదయం ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు విలవంగోడు ఎమ్మెల్యే విజయతరణి తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆ నియోజకవర్గానికి లోక్‌సభ ఎన్నికలతో పాటు ఏప్రిల్ 19న ఉప ఎన్నిక జరిగింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తారగైకత్‌బర్ట్ విజయం సాధించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం సచివాలయంలోని స్పీకర్ అప్పావు ఛాంబర్‌లో ఆమె శాసనసభ్యురాలిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మంత్రులు కేఎన్ నెహ్రూ, పొన్ముడి, ఈవీ వేలు, రాజకన్నప్పన్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, ఎంపీ విజయ్‌వసంత్ శాసన సభ్యులు రాజేష్‌దాస్, రూబీ మనోహరన్ తదితరులు కూడా పాల్గొన్నారు.

సేలం వద్ద

బైకులను ఢీకొన్న బస్సు

పసికందు సహా నలుగురి దుర్మరణం



మృతి చెందిన వేదవల్లి (ఫైల్‌ఫొటో)



బైకులపై పడిఉన్న మృతదేహాలు

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా కక్కపట్టి వద్ద బుధవారం ఉదయం రెండు బైకులను ఆమ్నీ బస్సు ఢీకొన్న దుర్ఘటనలో పసికందు సహా నలుగురు దుర్మరణం చెందారు. వివరాలిలా ... కక్కపట్టి వద్ద వీరాణం సమీపం పూమనూరుకు చెందిన మురుగన్ (30), ఆయన భార్య రాజి, వారి కుమారులు దిలీప్ (4), చిన్నదురై (7), వేరే బైకుపై లక్ష్మణన్ (35), ఆయన భార్య వేదవల్లి (28), నందిని (25) అనే మహిళలు, ఓ పసికందు ప్రయాణిస్తుండగా, వారి ముందు వెళుతున్న లారీ సడెన్‌గా ఆగిపోయింది. దీంతో రెండు బైకులు ఆ లారీ వెనుక భాగాన్ని వేగంగా ఢీకొన్నాయి. అదే సమయంలో బైకుల వెనుక వస్తున్న ఆమ్నీ బస్సు వారిని ఢీకొన్నది. ఈ ప్రమాదంలో మురుగన్, వేదవల్లి, నందిని అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన ఏడాది పసికందును ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కన్నుమూసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు. ఈ ప్రమాదం కారణంగా ఆ మార్గంలో అరగంటకు పైగా ట్రాఫిక్ స్తంభించింది. ఇదిలా వుండగా ఈ ఘటనలో గాయపడిన మరో ముగ్గురు సేలం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా ఈ ప్రమాదం పట్ల ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తలా రూ.2 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు ప్రకటించారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అప్పావు

29 వరకే


శాసనసభ సమావేశాలు

- రెండు పూటలా సాగనున్న సభలు
- స్పీకర్ అప్పావు

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాలు 29వ తేదీతో ముగుస్తాయని స్పీకర్ అప్పావు ప్రకటించారు. సచివాలయంలో స్పీకర్ ఛాంబర్‌లో విలవంగోడు ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం అనంతరం శాసనసభ వ్యవహారాల మండలి సమావేశం జరిగింది. దీని తరువాత స్పీకర్ అప్పావు మీడియాతో మాట్లాడుతూ... శాసనసభ సమావేశాల్లో కీలకమైన ఆర్థిక పద్దులపై సమగ్రంగా చర్చించాల్సివుండడంతో ఈసారి సమావేశాలను ఉదయం, మధ్యాహ్నం నిర్వహించనున్నామని తెలిపారు. రెండుపూటలా సమావేశాలు జరిపేందుకు శాసనసభ వ్యవహారాల మండలి సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారన్నారు. ఈ నెల 20న శాసనసభ ప్రారంభం కాగానే ఇటీవల మరణించిన మాజీ శాసనసభ్యులకు నివాళులర్పించిన తర్వాత శాసనసభ్యుడు పుగళేంది మృతికి సంతాప తీర్మానం చేయనున్నామని చెప్పారు. విక్రవాండి ఉప ఎన్నిక జరుగనున్న కారణంగా ఈ నెల 24న ప్రారంభించాల్సిన శాసనసభ సమావేశాలను ముందుకు తెచ్చామన్నారు. రోజూ ఉదయం 9.30 గంటలకు సభ ప్రారంభమై సాయంత్రం వరకూ జరుగుతుందని, మొత్తం 16 సిట్టింగ్‌ల్లో ఈ సమావేశాలు జరుగుతాయన్నారు. విక్రవాండి ఉప ఎన్నికలను లోక్‌సభ ఎన్నికలు సమయంలోనే నిర్వహించి ఉండాల్సిందని, ప్రస్తుతం ఆ ఉప ఎన్నిక జరుగనుండటం వల్లే మళ్ళీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు.

అన్నాడీఎంకేలో చేరే ప్రసక్తే లేదు

- టీటీవీ దినకరన్



చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేలో 'అమ్మా మక్కళ్ మున్నేట్ర కళగం'ను విలీనం చేసే ప్రసక్తేలేదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ స్పష్టం చేశారు. తంజావూరులో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్రంలో బీజేపీ వ్యతిరేక పవనాలు లేవని లోక్‌సభ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. విక్రవాండి శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ఎన్డీయే తరఫున పోటీ చేసే అభ్యర్థిని కూటమి పార్టీల నాయకులంతా కలిసి ఎంపిక చేస్తారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే మిత్రపక్షాల నాయకులంతా విజయం కోసం తీవ్రంగా శ్రమించారని ఆయన కితాబునిచ్చారు. ఇదే స్ఫూర్తితో 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో సమష్టిగా ప్రయత్నిస్తే ఎన్డీయే గెలుపు తథ్యమని, అధికారంలోకి వస్తుందని దినకరన్ జోస్యం చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే పలు చోట్ల డిపాజిట్లు కూడా లోక్పోయిందని, ఈ దుస్థితికి ఆ పార్టీకి నాయకత్వం వహిస్తున్నవారే కారణమని ఆరోపించారు. రెండాకుల గుర్తున్నా పార్టీని విజయం వైపు నడిపించలేకపోయారని ఎద్దేవా చేశారు. అమ్మామక్కల్ మున్నేట్ర కళగం ప్రారంభించి ఏడేళ్లు పూర్తయ్యిందని, ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీని అన్నాడీఎంకేలో విలీనం చేసే ప్రసక్తేలేదని దినకరన్ ప్రకటించారు.

పుదునగర్‌లో

తగ్గని ఆందోళన

- బిక్కుబిక్కుమంటున్న స్థానికులు



ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తున్న వైద్యులు

పుదుచ్చేరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ డ్రైనేజీ నుంచి ఇళ్ళలోని మరుగుదొడ్లకు వ్యాపించిన హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువు కారణంగా ముగ్గురు మృతి చెందిన ఘటనతో పుదుచ్చేరిలోని పుదునగర్ ప్రాంతవాసులు తీవ్ర భయందోళనలకు గురవుతున్నారు. ఆ ప్రాంతంలో ఇంకా దుర్వాసన వస్తున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేయడంతో రెండు రోజులపాటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. పుదుచ్చేరి రెడ్డి పాళయం పుదునగర్‌లో హైడ్రోజెన్ సల్ఫైడ్ వాయువు పీల్చి ఓ బాలిక, ఇద్దరు మహిళలు దుర్మరణం చెందిన విషయం విధితమే. ఈ సంఘటన తర్వాత ఆ ప్రాంతంలోని మూడు వీధుల్లో నివసిస్తున్నవారిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రెవెన్యూ అధికారులు వారికి ఆహారం అందజేస్తున్నారు. బుధవారం ఉదయం ఆ ప్రాంతంలోని వారంతా గుళ్లలో బసచేశారు. మళ్ళీ విషవాయువు తమను పొట్టన బెట్టుకుంటుందన్న భయంతో వారు ఆ ప్రాంతంలోకి అడుగుపెట్టేందుకే భయపడుతున్నారు. ఇదిలా ఉండగా పుదునగర్ ప్రాంతంలో ఇందిరాగాంధీ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రి వైద్యులు అక్కడి గుడిలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటికి వెళ్ళి పరిశీలిస్తున్నారు. అదే విధంగా మున్సిపల్ సిబ్బంది ఆ ప్రాంతంలో వాంతులు, తలనొప్పితో బాధపడేవారు పరీక్షలు చేయించుకోవాలని మైకులో ప్రకటిస్తున్నారు. ఇక ఇళ్ళను విడిచి ఉద్యానవనాలు, గుళ్ళలో నివసించేవారికి రెవెన్యూ అధికారులు తోపుడు బండ్లపై ఆహారం తీసుకెళ్ళి అందజేస్తున్నారు. ప్రస్తుతం పుదునగర్‌లోని మూడు వీధులు నిర్మానుష్యంగా ఉన్నాయి.



పుదునగర్‌వాసులకు తోపుడు బండిపై ఆహారం అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

విల్లుపురం హైరోడ్డులో రాస్తారోకో

బాధితలను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ డీపీఐ, సీపీఐ పార్టీల నేతలు, కార్యకర్తలు బుధవారం పుదుచ్చేరి విల్లుపురం హైరోడ్డులో రాస్తారోకో చేపట్టారు. దీంతో ఆ మార్గంలో గంటపాటు వాహనాలు నిలిచిపోయాయి. ప్రజలు తీవ్ర అవస్థలకు గురవ్వాల్సివచ్చింది. పోలీసులు పలుదఫాలుగా చర్చలు జరిపి ఆందోళనకారులు అక్కడి నుంచి తొలగించారు. ఈ సందర్భంగా నిరసనకారులు మీడియాతో మాట్లాడుతూ.. జరిగిన దుర్ఘటనపై రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

సమాచార దర్శిని

వ్యాసరచనలకు ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 12: దిండుగల్ జిల్లా పళనిలో ఆగస్టు 24, 25, 26 తేదీల్లో 'అఖిల లోక ముత్తమిళ్ మురుగన్' మహానాడు జరుగనుంది. ఇందులో పాల్గొనేందుకు జూలై 15వ తేదీ లోగా దరఖాస్తులు పంపించాల్సి వుంది. అదే విధంగా ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామి విశిష్టతలపై వ్యాసాలు పంపదలచినవారు జూలై 30వ తేదీ లోపు https://muthamizhmurugunmaanadu2024.com వెబ్‌సైట్‌లో సమర్పించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

30న 'సాహిత్యము - చమత్కార వైభవము'

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): 'వేదవిజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక కార్యక్రమం ఈ నెల 30వ తేదీన జరుగనుంది. టి.నగర్ విజయరాఘవరోడ్డులో వున్న ఆంధ్రా క్లబ్‌లో సాయంత్రం 6.30 గంటలకు 'సాహిత్యము - చమత్కార వైభవము'అనే అంశంపై ముంబైకి చెందిన సారస్వతోపాసకులు సంప్రతి సురేంద్రనాథ్ ఉపన్యసించనున్నారు. ఈ కార్యక్రమానికి సాహితీప్రియులందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఇకపై బీటెక్ పాఠ్యాంశంలో ఇంటర్న్‌షిప్

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఐఐటీలోని బీటెక్‌లో మార్పులు చేపట్టారు. స్టార్టప్ కోసం ఇంటర్న్‌షిప్ ముఖ్యపాత్ర పోషిస్తుంది. చెన్నై ఐఐటీకి చెందిన విద్యార్థుల అభిప్రాయాల మేరకు ఇంటర్న్‌షిప్ ప్రవేశపెట్టారు. డిగ్రీలో బోధనా కాలాన్ని 436 గంటలకు బదులుగా 400కి కుదించారు. విద్యార్థులు చదువుకునే సమయంలోనే 40 శాతం ప్రాక్టికల్స్‌తో కూడిన ఇంటర్న్‌షిప్‌కు కూడా సమయం కేటాయించారు. ఈ విధానం విద్యార్థులు ఉద్యోగాల్లో చేరినప్పుడు ఎంతో దోహదపడుతుందని విద్యావేత్తలు తెలిపారు.

28 రైళ్ల రద్దు

ఐసిఎఫ్, జూన్ 12: రైలు మార్గాల్లో మరమ్మతుల కారణంగా 28 రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణరైల్వే ప్రకటించింది. కాట్పాడి-జోలార్‌పేట మీదుగా ఈ నెల 16వ తేదీన మరో మార్గంలో 17వ తేదీన నడవనున్న విశాఖపట్నం-ఎస్ఎంవీటీ బెంగుళూరు వారాంతపు ప్రత్యేక రైళ్లు, విశాఖపట్నం నుంచి ఎగ్మూరుకు ఈ నెల 15, 17 తేదీల్లోనూ రావాల్సిన రైళ్లు కూడా రద్దయ్యాయి. అదే విధంగా ఈ నెల 16వ తేదీన తాంబరం నుంచి ధన్‌బాద్, 18న కోయంబత్తూరు నుంచి బ్రౌనీకి వెళ్లాల్సిన రైళ్లు కూడా రద్దయినట్లు అధికారులు తెలిపారు.

రూ.6.50 కోట్లకు పొట్టేళ్ల విక్రయం

ఐసిఎఫ్, జూన్ 12: బక్రీద్ పండుగను పురస్కరించుకుని వేలూరు, శివగంగ, తిరునల్వేలి, తెన్‌కాశి సంతల్లో రూ.6.50 కోట్ల మేరకు పొట్టేళ్ల విక్రయం జరిగినట్లు వ్యాపారులు తెలిపారు. వేలూరు పొయ్‌గై పశువుల సంతలో రూ.1.50 కోట్లకు పశువుల విక్రయం జరిగింది. గరిష్టంగా ఒక పొట్టేలు రూ.80 వేలకు విక్రయమైనట్లు వ్యాపారులు తెలిపారు. ఈ విక్రయాలు మునుముందు మరింత పుంజుకోనున్నట్లు వారు వివరించారు.

ఈసీఆర్‌లో టోల్ రుసుము పెంపు

ఐసిఎఫ్, జూన్ 12: స్థానిక అక్కరై-మహాబలిపురం మధ్యలో వున్న ఈసీఆర్‌లోని టోల్‌రుసుము పెరిగింది. ఈ రోడ్డు రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ పర్యవేక్షణలో వుంది. ఈ మార్గంలో వెళ్లే వాహనాలకు వసూలు చేసే టోల్ రుసుం ప్రతియేటా ఏప్రిల్ 1వ తేదీ నుంచి పెరుగుంది. అయితే లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో వుండడంతో ఇన్నాళ్లూ పాత రుసుమే వసూలు చేశారు. ఈ నేపథ్యంలో టోల్ రుసుం పెంచారు.

జూలై 21న జూనియర్ టీచర్స్ నియామక పరీక్ష

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న జరగాల్సిన జూనియర్ టీచర్స్ నియామక పరీక్ష జూలై 21కి వాయిదా పడినట్లు టీచర్స్ నియామక పరీక్షా బోర్డు ప్రకటించింది. తమిళనాడులో టీచర్లుగా చేరాలంటే రెండు పరీక్షలు రాయాల్సివుంది. మొదటగా టెట్ పాస వ్వాల్సివుంటుంది. అనంతరం టీచర్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించే పరీక్ష రాయాల్సివుంటుంది. కాగా ఈ ఏడాది ఎస్‌జీటీ పోస్టుల కోసం ఈ నెల 23న పరీక్ష నిర్వహించనున్నట్లు బోర్డు గతంలో ప్రకటించింది. అయితే ఎన్నికల కోడ్ అమలులో వున్నందున పరీక్షా నిర్వహణ పనులకు అవాంతరం కలగడంతో ఈ పరీక్షను జూలై 21వ తేదీకి వాయిదా వేసినట్లు బోర్డు స్పష్టం చేసింది.

బీఈలో చేరేందుకు 2.54 లక్షల మంది దరఖాస్తు

ఐసిఎఫ్, జూన్ 12: ఈ ఏడాది ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తుల నమోదు కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో మొత్తం 2,53,954 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కోర్సులకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ మే 6న ప్రారంభమైంది. మొత్తం 2,53,954 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 2,09,645 మంది దరఖాస్తు రుసుము చెల్లించారు. 1,93,853 మంది సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసినట్లు అధికారులు వివరించారు.

నేడు టీచర్ల బదిలీ కౌన్సెలింగ్

ఐసిఎఫ్, జూన్ 12: ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్ గురువారం జరుగనుంది. రిటైర్డ్ టీచర్లు, మార్చిలో జరిగిన అడ్మిషన్ల వివరాలను దృష్టిలో పెట్టుకుని పాఠశాలల్లో అదనంగా వున్న టీచర్ల జాబితా రూపొందించారు. ఆ ప్రకారం 1862 మంది ఉపాధ్యాయులు అదనంగా వున్నట్లు గుర్తించారు. వీరిని ఉపాధ్యాయుల కొరత వున్న పాఠశాలలకు బదిలీ చేయనున్నారు. ఈ బదిలీ కౌన్సిలింగ్ గురువారం జరుగనుంది.

హుండీ ఆదాయం రూ.2.5 కోట్లు

ఐసిఎఫ్, జూన్ 12: పళని మురుగన్ ఆలయ హుండీ ఆదాయం రూ.2.5 కోట్లు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ఈ ఆలయంలోని హుండీల ఆదాయ లెక్కింపు ప్రక్రియ సోమ, మంగళవారాల్లో ఉన్నతాధికారుల సమక్షంలో జరిగింది. రూ.2 కోట్ల 55 లక్షల 37 వేల 740 నగదు, 965 గ్రాముల బంగారు ఆభరణాలు, 29 కిలోల 18 గ్రాముల వెండి వస్తువులు, 574 విదేశీ కరెన్సీ నోట్లు భక్తులు కానుకగా సమర్పించారని నిర్వాహకులు తెలిపారు.

జూలైలో వీధి శునకాల గణన

ఐసిఎఫ్, జూన్ 12: చెన్నైకార్పొరేషన్ పరిధిలో వచ్చే నెల వీధి శునకాల గణన చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. నగరంలో వీధి కుక్కల బెడద రోజురోజుకి పెరుగుతోంది. వీటి సంఖ్యను నియంత్రించేందుకు శస్త్రచికిత్సలు చేపడుతున్నారు. అయినప్పటికీ వీటి సంఖ్య ఏమాత్రం తగ్గడం లేదని అధికారులు గుర్తించారు. దీంతో జూలైలో గణన నిర్వహించి, 60 రోజుల్లో 200 వార్డుల్లో టీకాలు వేయడం, శస్త్రచికిత్సలు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

కుట్రాలంలో సీజన్ ప్రారంభం

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం కుట్రాలం జలపాతాల వద్ద సీజన్ ప్రారంభమైంది. ప్రతియేటా జూన్, జూలై, ఆగస్టు నెలల్లో కుట్రాలం జలపాతాల్లో జలకళ సంతరించుకుంటుంది. పడమటి కనుమల్లో కురిసే భారీ వర్షాల కారణంగా వర్షపునీరంతా కొండలపై మూలికల మీదుగా ప్రవహించి కుట్రాలం జలపాతాల్లో పడుతుంటాయి. ఆ మూలికల వాసన కలిగిన కుట్రాలం జలపాతంలో స్నానం చేయడానికి దేశవిదేశాల నుంచి పర్యాటకులు భారీ సంఖ్యలో వస్తుంటారు. ఈ నేపథ్యంలో కేరళలో ప్రవేశించిన నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెన్‌కాశి జిల్లాలోని పడమటి కనుమల్లో తేలికపాటి జల్లులు కురుస్తున్నాయి. దీంతో కుట్రాలంలోని జలపాతాల వద్ద ప్రస్తుతం చల్లటివాతావరణం చోటుచేసుకుంది. ప్రధాన జలపాతం, ఐందరువి, పాత కుట్రాలం జలపాతంలో ఉధృతంగా నీటి ధారలు పడుతున్నాయి. ఈ జలపాతాల వద్ద సోమవారం నుండే పర్యాటకుల సందడి అధికమైంది. బుధవారం ఉదయం పొరుగు జిల్లాల నుంచి కూడా పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చి కుట్రాలం జలపాతం వద్ద స్నానం చేశారు. తెన్‌కాశి, పడమటి కనుమల వద్ద బుధవారం ఉదయం ఆకాశం మేఘావృతమై చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. దీంతో ఆ జలపాతాల వద్ద సీజన్ ప్రారంభమైందని అధికారులు ప్రకటించారు. పాతకుట్రాలం జలపాతం పరిసరాలన్నీ స్నానం చేయడానికి వచ్చిన పర్యాటకులతో కిటకిటలాడింది.



కుట్రాలం ప్రధాన జలపాతంలో నీటి ఉధృతి

చంద్రబాబుకు 'వామ్' కృతజ్ఞతలు

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు తన క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం కల్పించిన టీడీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు 'ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ' (వామ్) కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు వామ్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ ప్రకటన విడుదల చేశారు. కర్నూలు ఎమ్మెల్యేగా ఎన్నికైన టీజీ భరత్‌కు క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం కల్పించాలంటూ ఇటీవల తాము చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబుకు, ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలిసారే మంత్రి పదవిని అధిరోహించిన టీజీ భరత్‌కు తంగుటూరి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

మత్తు పదార్థాల వినియోగాన్ని అడ్డుకోండి

● పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి



వేలూరు, జూన్ 12: రాష్ట్రంలో మత్తుపదార్థాల వినియోగం పెరిగిందని, దీనిని తక్షణం అడ్డుకోవాల్సిన అవసరముందని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్ డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం వేలూరులో జరిగిన ఓ కార్యకర్త వివాహానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో యువత మత్తుపదార్థాలకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కావేరీ నీటి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుందని, దీనిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కనీసం రాష్ట్రంలోనైనా నీట్ రద్దు చేయాలని కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని పాలన అద్భుతంగా వుందని, అందుకే దేశ ప్రజలు మళ్లీ ఆయనకే పట్టం కట్టారని అన్బుమణి ప్రశంసించారు.

నిబంధనలు ఉల్లంగించే ఆమ్నీ బస్సులపై చర్యలు

ఐసిఎఫ్, జూన్ 12: నిబంధనలు ఉల్లంఘించే ఆమ్నీ బస్సుల యజమానులపై గురువారం నుంచి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ షణ్ముఖ సుందరం హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల లైసెన్సు పొందిన 652 ఆమ్నీ బస్సులను గుర్తించి, రాష్ట్ర రిజిస్ట్రేషన్ పొందాలని బస్సుల యజమానులకు సూచించామని తెలిపారు. మూడుసార్లు అవకాశమివ్వగా 105 బస్సులు మాత్రమే తమిళనాడు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. నిబంధనలు ఉల్లంఘించే ఆమ్నీ బస్సుల యజమానులపై చర్యలు చేపడతామని హెచ్చరించారు.

ఇకపై కాలేజీల్లో రెండుమార్లు అడ్మిషన్లు

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఇకపై కాలేజీల్లో, యూనివర్సిటీల్లో ఏడాదికి రెండుమార్లు ప్రవేశాలకు అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు యూజీసీ ఉన్నతాధికారులు తెలిపారు. యూజీసీకి అనుబంధంగా వున్న ఉన్నత విద్యలో సంవత్సరానికి రెండుసార్లు అడ్మిషన్లు జరపాలని ఖరారు చేశారు. ఈ మేరకు 2023లో జరిగిన యూజీసీ 571వ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీనిపై అభిప్రాయ సేకరణ జరపగా, విద్యార్థుల నుంచి స్పందన లభించింది. దీంతో ఆ నిర్ణయాన్ని ఖరారు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై జూలై-ఆగస్టులో, జనవరి-ఫిబ్రవరి నెలల్లో.. సంవత్సరానికి రెండుసార్లు విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వివిధ కారణాలతో జూలై-ఆగస్టులో అడ్మిషన్లు పొందలేనివారు జనవరిలో అడ్మిషన్లు పొందేందుకు అనువుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు వివరించారు.

విద్యార్థులకు యూనిఫాం, నోటు పుస్తకాల పంపిణీ



వేలూరు, జూన్ 12: వేలూరు జిల్లా గుడియాత్తం సెరువంగి మున్సిపల్ పాఠశాలలో బుధవారం విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం, నోటు పుస్తకాల పంపిణీ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున జరిగిన ఈ పంపిణీ కార్యక్రమంలో నగర ప్రముఖులు దళిత్ కుమార్, దీపికాదయాళన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, జూన్12(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సినీనటులు శ్రీలక్ష్మి ఐశ్వర్యరాజేష్ ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



శ్రీలక్ష్మి, ఐశ్వర్యరాజేష్

విమానాశ్రయానికి బాంబు బెదిరింపు


చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చెన్నై విమానాశ్రయంలో బాంబు పేలబోతోందంటూ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌లో బెదిరించాడు. దీంతో బాంబు స్క్వాడ్‌తో విమానాశ్రయం అంతటా తనిఖీ చేశారు. గ్రేటర్ చెన్నై పోలీస్ ఈస్ట్ కంట్రోల్ రూమ్‌కు బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి విమానాశ్రయంలో బాంబులున్నాయని, కాసేపట్లో పేలనున్నాయని తెలిపి ఫోన్ కట్ చేశాడు. వెంటనే కంట్రోల్ రూమ్ అధికారులు విమానాశ్రయం భద్రతా విభాగం ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. వెంటనే విమానాశ్రయం భద్రతా దళ అధికారులు బాంబు స్క్వాడ్, పోలీసు జాగిలాలతో జాతీయ, అంతర్జాతీయ విమానాశ్రయాల్లో తనిఖీలు జరిపారు. అదే సమయంలో పోలీసులు ఫోన్‌లో బాంబు బెదిరింపు చేసిన వ్యక్తి ఆచూకీని కంట్రోల్ రూమ్‌లో నమోదైన ఫోన్ నెంబర్ ఆధారంగా కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ సంఘటన కారణంగా అక్కడ కొంతసేపు ఉద్రిక్త నెలకొంది.

మూడు దశాబ్దాల తరువాత పింఛను

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగ్గా లేని కారణంగా మూడు దశాబ్దాల క్రితం తప్పిపోయిన ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఓ మాజీ ఉద్యోగి ఇన్నాళ్లకు మళ్లీ కుటుంబీకులను కలుసుకున్నారు. స్థానిక తిరుముల్లైవాయల్‌కు చెందిన పాపమ్మాళ్ (94) కొడుకు వినాయగం ఎయిర్‌ఫోర్స్‌లో పని చేస్తున్నాడు. ఆయనకు మానసిక స్థితి దెబ్బతినడంతో ఉద్యోగం నుంచి పదవీవిరమణ పొందారు. దాంతో ఆ పింఛను ఆధారంగానే పాపమ్మాళ్ తన కుమారుణ్ని చూసుకునేది. అప్పుడప్పుడూ వినాయగం ఇంట్లో చెప్పాపెట్టకుండా బయటకు వెళ్లిపోయేవాడు. కాగా పదవీవిరమణ పొందిన వారు ప్రతి ఏడాది పింఛను కార్యాలయంలో ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సివుంది. ఈ నేపథ్యంలో 1994 నుంచి వినాయగం కనిపించకుండాపోయాడు. అతని కోసం పాపమ్మాళ్ గాలిస్తూనే వుంది. ఈ నేపథ్యంలో ఇటీవల తిరుత్తణి ఆలయం వద్ద బిక్షాటన చేస్తున్న వినాయగాన్ని అతని బంధువులు గుర్తించి, ఇంటికి తీసుకొచ్చారు. దాంతో పాపమ్మాళ్ తేనాంపేటలోని ఏజీఎస్ కార్యాలయానికి కుమారుణ్ణి తీసుకెళ్లి అన్ని వివరాలు వెల్లడించింది. దీంతో గత 30 ఏళ్లగా నిలిచిపోయిన పింఛన్‌ను ఆ తల్లీకొడుకులకు ఉన్నతాధికారులు అందించారు.

విడుదల కాని మేట్టూర్ జలాలు

● ఆందోళనలో రైతులు



ఐసిఎఫ్, జూన్ 12: మేట్టూరు డ్యాం జలాలు బుధవారం విడుదల కాకపోవడంతో కావేరీ డెల్టా రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ డ్యాం నుంచి ప్రతి ఏటా జూన్ 12న కావేరీ డెల్టాలో సాగునీరు విడుదల చేస్తుంటారు.. ఈ జలాలు అవసరాన్ని బట్టి మరుసటి ఏడాది జనవరి 28వ తేదీ వరకు విడుదలవుతుంటాయి. దీని ద్వారా ఖరీఫ్ సహా మూడు పంటలకు జరిపడా నీరు లభిస్తుంది. మంగళవారం డ్యాంలో నీటి చేరిక సెకనుకు 390 ఘనపుటడుగులకు తగ్గింది. నీటిమట్టం తక్కువగా ఉండడంతో ఈ ఏడాది జూన్ 12వ తేదీన జలాలు విడుదల చేయలేని పరిస్థితి నెలకొందని అధికారులు చేతులెత్తేశారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

వేలూరు జిల్లాలో ముమ్మర తనిఖీలు

● భారీగా గుట్కా స్వాధీనం

వేలూరు, జూన్ 12: వేలూరు జిల్లా వ్యాప్తంగా బుధవారం దుకాణాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు భారీగా గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 14 మందిపై కేసు నమోదు చేశారు.



దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రభుత్వ బస్సుల్లో జీపీఎస్ పరికరాలు

ఐసిఎఫ్, జూన్ 12: అన్ని ప్రభుత్వ బస్సుల్లో జీపీఎస్ పరికరాలు, ఎల్ఈడీ బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి శివశంకర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా నోటు, పాఠ్యపుస్తకాల పంపిణీ, పాఠశాలల్లోనే ఆధార్ నమోదు శిబిరాన్ని పెరంబలూరు ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో మంత్రి శివశంకర్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణించే విద్యార్థుల భద్రత కోసం కొత్తగా కొనుగోలు చేసిన అన్ని బస్సుల్లో ఆటోమేటిక్ డోర్లున్నాయన్నారు. ఇదివరకే వున్న బస్సులకే ఈ డోర్లు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులకు కొత్త బస్ పాస్‌లు ఇచ్చే వరకు పాత పాస్‌లనే వినియోగించుకోవాలని మంత్రి సూచించారు.

రక్తదానంపై అవగాహన అవసరం

● డాక్టర్ దవపళని అళగప్పన్



రక్తదానం చేసిన ప్రముఖులతో అపోలో ఆస్పత్రి వైద్యనిపుణులు

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రక్తదానంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అపోలో హాస్పిటల్ అత్యవసర విభాగాధిపతి డాక్టర్ దవపళని అళగప్పన్ అన్నారు. నగరంలో బుధవారం ఉదయం రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తమార్పిడి జరిగి కోలుకున్న రోగులు, రక్తదానం చేసిన వ్యక్తులను సత్కరించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శస్త్రచికిత్స చేసుకునే రోగులకు, కొన ఊపిరితో ఉండే రోగులకు అత్యవసరంగా రక్తం అవసరమవుతుందని, ఆ సమయంలో దాతలు రక్తదానం చేయడానికి ముందుకురావాలని పిలుపు నిచ్చారు. అదే సమయంలో ఆస్పత్రుల వద్ద అన్ని గ్రూపుల రక్తపు నిల్వలు సిద్ధంగా ఉంటే విపత్కర పరిస్థితుల నుండి రోగులను కాపాడగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ ఆర్కే వెంకటాచలం, చీఫ్ న్యూస్ యాంకర్ సీఏ మోహన్‌రాజ్, అన్నాయూనివర్సిటీ రిమోట్ సెన్సింగ్ ఇన్‌స్టిట్యూటట్ డైరెక్టర్ తిరుమలైవాసన్, నటుడు అశోక్‌కుమార్ బాలకృష్ణన్ అపోలో బ్లడ్ బ్యాంక్ కన్సల్టెంట్ డాక్టర్ మదన్‌కుమార్, రోగులు, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూన్ 12: విద్యుత్‌లైన్లలో మరమ్మతుల కారణంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని అధికారులు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే ప్రాంతాల వివరాలిలా... **పల్లావరం:** దర్గారోడ్, పెరుమాళ్‌నగర్, పాలిమర్ నగర్, వైద్యలింగం రోడ్, హైవే నగర్, శంకర్ నగర్, పమ్మల్, తిరునీర్‌మలై మెయిన్‌రోడ్, భారతి వీధి, జార్జ్‌ఫెర్నాండెజ్ వీధి, మసీదు వీధి, ఇబ్రహీం వీధి, అనకాపుత్తూర్, కలైంజర్ వీధి, అన్నా నగర్, మహాత్మాగాంధీ రోడ్, భక్తవత్సలం నగర్, మార్కెట్‌రోడ్డు, కట్టబొమ్మన్ నగర్, ఆర్‌కేవీ అవెన్యూ, వేల్స్ కళాశాల మెయిన్‌రోడ్, జమీన్ రాయపేట, సెంథిల్‌నగర్, పిళ్లయార్ ఆలయ వీధి, కన్నికోయిల్ వీధి, భారతీనగర్ మెయిన్‌రోడ్, భారతినగర్ 1 నుంచి 5 వరకు క్రాస్‌వీధులు, తులగాత్తమ్మన్ ఆలయ వీధి, వైద్యర్‌వీధి

అడయార్: మల్లైపూ నగర్, అడయార్ 4వ మెయిన్‌రోడ్, గాంధీనగర్ 1-4 మెయిన్‌రోడ్‌లు, కైలాష్, అన్నాఎన్‌క్లేవ్, ఈసీఆర్, రాయల్ ఎన్‌క్లేవ్, వెట్టువాంగేని, సాయిబాబా ఆలయ వీధి, ఆలివ్‌బీచ్ జీజీ గార్డెన్, చోళన్ నగర్, కస్తూరిబాయ్ నగర్, కాల్వాయ్ రోడ్డు, కేపీ నగర్ 1-3 వీధులు, పీవీ నగర్, అన్నా అవెన్యూ, గోవిందరాజపురం, సర్దార్‌పటేల్ రోడ్. **ఆవడి:** తిరుముల్లైవాయల్, ఎస్టేట్ సిట్కో, లక్ష్మీపురం, అరిక్కమేడు, పమ్మదుకులం, ఎడప్పాళయం, ఎల్లయమ్మన్‌పేట, ఈశ్వరన్ నగర్, అంబేద్కర్ నగర్, గాంధీనగర్. **షోళింగనల్లూర్:** పెరుంబాక్కం, గౌరివాక్కం, పుదునగర్, మునస్వామి నగర్, వేళచ్చేరి మెయిన్‌రోడ్, బెల్ నగర్, పటేల్ కంపెనీ, అవ్వైవీధి, మూక్కంపాలయం, పెరియపాలయత్తమ్మన్ ఆలయ వీధి, పిళ్లయార్ ఆలయ వీధి, పెరుంబాక్కం మెయిన్‌రోడ్, జయ నగర్, వివేకానంద నగర్ మెయిన్‌రోడ్, పళ్లిక్కరణై, అక్షయఫ్లాట్స్, పెరుమాళ్‌నగర్, అప్పాస్వామి కాలనీ, మెబిల్టన్ కాలనీ, మాడవీధి, కోవిలంబాక్కం, ఓంశక్తి నగర్, సత్యనగర్, సుభిక్షా అవెన్యూ, సుశీల నగర్, వడక్కుపట్టు మెయిన్‌రోడ్, పెరియార్‌నగర్, నవీన్స్ బెల్ నగర్, లింక్ రోడ్, చిత్తాలపాక్కం, అదినాథ్ అవెన్యూ, బాలాజీనగర్, తిరుమూలర్ అవెన్యూ, విజయనగరం.

పోరూర్: తిరుముడివాక్కం 1-14 మెయిన్‌రోడ్డు వరకు, సిడ్కో ఏరియా, తిరుములిసై, పాలివాక్కం, సోరన్‌చేరి, ఆయిల్‌చేరి, చిత్తుక్కాడు, తిరుక్కోయిల్ పత్తు, గెరుగంబాక్కం, రాట్‌నగర్, కుంద్రత్తూర్ రోడ్, మాంగాడు ఏరియా.

గిండి: వానువంపేట, ఆదంబాక్కం, మూవరసంపేట, ముగలివాక్కం, నంగనల్లూర్, మడిపాక్కం, రామాపురం, పుళుదివాక్కం, రాజ్‌భవన్, ఆలందూర్, సెయింట్‌థామస్‌మౌంట్.

మీరేమంటారు?

చెన్నైలో తమిళ్ యూనివర్సిటీ ఏర్పాటుపై హైకోర్టు ప్రశ్న

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని నగరమైన చెన్నైలో తమిళ యూనివర్సిటీ ఏర్పాటు చేయలంటూ దాఖలైన పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని మద్రాస్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.మహాదేవన్, జస్టిస్ మహమ్మద్ షఫీ నేతృత్వంలోని ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. చెన్నైలో తమిళ్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలంటూ న్యాయవాది కనకరాజ్ గతంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానుల్లోనే ఆయా అధికార భాషలకు సంబంధించిన యూనివర్శిటీలుయని, కానీ తమిళనాడులో మాత్రం తంజావూరులో ఏర్పాటైందని పిటిషనర్ పేర్కొన్నారు. దీనిపై వివరణ ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. అదే విధంగా శ్రీలంక శరణార్థులకు శాశ్వత పౌరసత్వం కల్పించాలంటూ మరో పిటిషన్ దాఖలు కాగా, దానిపై వివరణ ఇవ్వాలని ధర్మాసనం కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించింది. తమిళనాడు నుంచి ప్రయాణించే విమానాల్లో తమిళభాష ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పైనా వివరణ ఇవ్వాలని ధర్మాసనం కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.

సైబర్ క్రైం పై లఘుచిత్రాల పోటీ

ఐసిఎఫ్, జూన్ 12: సైబర్ నేరాలపై నిర్వహించనున్న లఘుచిత్రాల్లో పాల్గొనేందుకు ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవాలని పోలీసు అధికారులు సూచించారు. ప్రజలు తమ సృజనాత్మకత, ఆవిష్కరణ, నైపుణ్యత బహిర్గతం చేసేలా ఈ పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో పాల్గొనేవారు కొరియర్ మోసాలు, వాణిజ్య పెట్టుబడుల మోసాలు, విద్యుత్ బిల్లుల మోసాలు, డిజిటల్ మోసాలు, విద్యా ఉపకారవేతనాల పేరుతో మోసాలు అనే శీర్షికల్లో లఘుచిత్రాలు తీసి ఈ నెల 27వ తేదీ లోగా పోలీస్‌శాఖకు పంపించాలి. విజేతలను జూలై 5వ తేదీ ప్రకటించి, ప్రథమ బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు, తృతీయ బహుమతిగా రూ.15 వేలు అందజేయనున్నారు.

గంజాయి తరలించిన ముగ్గురి అరెస్టు

ఐసిఎఫ్, జూన్ 12: చెంగల్పట్టులో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు.. వారి నుంచి 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉదయం పోలీసులు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన శరవణన్, బాలకృష్ణన్, సూరమ్మ పొంతనలేని సమాధానాలిచ్చారు. దీంతో వారి సంచిని తనిఖీ చేయగా, అందులో గంజాయి బయల్పడింది. దీంతో ఆ గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. ఆ ముగ్గురినీ అరెస్టు చేశారు.

తిరువాన్మియూరులో లాయర్ దారుణహత్య



గౌతమ్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తిరువాన్మియూరులో నివసిస్తున్న ఓ న్యాయవాదిని పాతకక్షల నేపథ్యంలో ముగ్గురు వేటకొడవళ్లతో దాడిచేసి దారుణంగా హతమార్చారు. తిరువాన్మియూరు అవ్వైనగర్‌లో నివసిస్తున్న గౌతమ్ (29) సైదాపేట కోర్టులో న్యాయవాదిగా వ్యవహరిస్తున్నారు. మంగళవారం రాత్రి ఇంటి నుంచి బైకుపై వెళ్ళిన గౌతమ్ తిరువళ్లువర్ రోడ్డులోని ఏటీఎం వద్ద స్నేహితులతో మాట్లాడుతుండగా గుర్తుతెలియని ముగ్గురు దుండగులు చుట్టుముట్టి ఆయనపై వేటకొడవళ్లతో దాడిచేసి పారిపోయారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన గౌతమ్‌ను అడయార్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స ఫలించక ఆయన మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతుండగా ఈ హత్యకు సంబంధించి కొట్టివాక్కం, కన్నగినగర్ ప్రాంతాలకు చెందిన కమలేష్, నిత్యానంద్, పార్థిబన్ అనే వార పోలీసులకు లొంగిపోయారు. పాతకక్షల నేపథ్యంలో గౌతమ్‌ను హతమార్చినట్లు ఆ ముగ్గురు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు.

కొరుక్కుపేటలో అన్న కోసం వెళ్ళి తమ్ముడిని హతమార్చిన దుండగులు

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరుక్కుపేట కరుమారియమ్మన్ నగర్‌లో మంగళవారం రాత్రి పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడిని హతమార్చేందుకు వెళ్ళిన దుండగులు అతడి తమ్ముడిపై వేటకొడవళ్లతో దాడి జరిపి హతమార్చారు. కరుమారియమ్మన్ నగర్‌లో సూర్యా, ధర్మా (24) అనే అన్నదమ్ములు నివసిస్తున్నారు. మంగళవారం రాత్రి ధర్మా తన స్నేహితులతో కలిసి రైలు పట్టాలపై కూర్చుని మద్యం తాగుతుండగా కొందరు దుండగులు అక్కడికి వెళ్ళి సూర్యా ఆచూకీ చెప్పమని అడిగారు. ధర్మా తన అన్న గురించి ఎలాంటి సమాచారం చెప్పకపోవడంతో ఆగ్రహించిన దుండగులు కత్తులు, వేటకొడవళ్లతో అతడిపై దాడి జరిపారు. ధర్మాతో పాటు అతడి స్నేహితుడు కిషోర్‌పై కూడా దాడి చేసి పారిపోయారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన ధర్మాను చికిత్స కోసం స్టాన్లీ ఆస్పత్రికి తరలించారు. బుధవారం వేకువజామున చికిత్స ఫలించక ధర్మా మరణించాడు. ఆర్కేనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

ఏనుగుల దాడులపై ప్రజలను అప్రమత్తం చేయండి

● సీసీఎఫ్‌వో నాగేశ్వరరావు



ఏనుగుల సంరక్షణ గురించి సిబ్బందికి వివరిస్తున్న సీసీఎఫ్‌వో

కుప్పం, జూన్ 12: గ్రామీణ ప్రాంతాల్లో ఏనుగుల దాడులపట్ల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూ ఉండాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆఫీసర్ నాగేశ్వరరావు అటవీ శాఖ అధికారులకు సూచించారు. మంగళ, బుధవారాల్లో ఆయన కుప్పం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. రామకుప్పం మండలంలోని ననియాలలో గుంకీ ఏనుగుల సంరక్షణ సరిగా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సీసీఎఫ్‌వో మాట్లాడుతూ ఏనుగుల దాడుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తల గురించి సిబ్బందికి వివరించారు. మూడు రాష్ట్రాల కూడలిలో కుప్పం ఉన్నందున అటవీ సరిహద్దు గ్రామాల వద్ద నిరంతరం నిఘా ఉంచి ఏనుగుల దాడుల నుంచి గ్రామీణులకు, పంటలకు రక్షణ కల్పించాలని ఆదేశించారు. ఏనుగులు ఉద్రేకానికి లోనయ్యే పనులు చేయకుండా గ్రామీణులను అప్రమత్తం చేస్తూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుప్పం ఎఫ్‌ఆర్వో జయశంకర్, డీఆర్వోలు వైసీ.రెడ్డి, కృష్ణ ప్రసాద్ ఇతర అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

నాలుగు నెలల గర్భిణి మృతి ● ఇద్దరికి స్వల్ప గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

బంగారుపాళ్యం, జూన్ 12: చెన్నై-బెంగుళూరు జాతీయ రహదారిలోని మొగిలిఘాట్ దొరచెరువు వద్ద బుధవారం ఉదయం కారు అదుపుతప్పి బోల్తాపడిన సంఘటనలో నాలుగు నెలల గర్భిణి మృతి చెందగా ఇద్దరికి స్వల్పగాయాలైన సంఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా. గుంటూరు జిల్లా గుజ్జనగుండ్ల బొజ్జరాయి వీధిలో నివాసముంటున్న ప్రకాష్ కుమార్, లక్ష్మిల కుమార్తె ఎస్.రాగ్నిచైత్రను గుంటూరు జిల్లా పిడుగురాళ్ళకు చెందిన ప్రతాప్‌కు ఇచ్చి వివాహం చేశారు. ప్రతాప్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. భార్య రాగ్నిచైత్ర నాలుగు నెలల గర్భిణి కావడంతో వేలూరు సీఎంసీలో చెకప్ చేయించడానికి తన కారులో బెంగళూరు నుంచి బయలుదేరారు. మార్గమధ్యలో మొగిలిఘాట్ దొరచెరువు వద్దకు చేరుకోగానే కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. వెనుకసీటులో కూర్చొని వున్న రాగ్నిచైత్ర(32) అక్కడికక్కడే మృతిచెందగా, ముందు సీటులో కూర్చొనివున్న ప్రతాప్, రాగ్నిచైత్ర తల్లి లక్ష్మిలకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడినవారిని 108 ద్వారా బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





ప్లాస్టిక్ డ్రమ్ముల్లో మంచినీరు నింపుతున్న దృశ్యం - కొత్తగా తెప్పించిన వలలను పడవలోకి ఎక్కిస్తున్న కార్మికులు



రొయ్యలపొట్టు సేకరణ

వంటపాత్రలను వలతో కడుతున్న మత్స్యకారుడు

పడవ పైన జెండా కడుతున్న కార్మికుడు

పడవలో ఐస్ నిల్వ చేస్తున్న మత్స్యకారుడు

కడలిలోకి ప్రవేశించేందుకు సిద్ధంగా ఉన్న కొత్త మర పడవ

రేపటి నుంచి చేపల వేటకు సిద్ధం

నేటితో ముగియనున్న నిషేధ కాలం

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేపల వేట నిషేధ కాలం ముగియనుండటంతో చెన్నై పరిసర జిల్లాలకు చెందిన మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లి చేపలు పట్టేందుకు సరంజామా సిద్ధం చేసుకుంటున్నారు. రాష్ట్రంలో తిరువళ్లూరు, కాంచీపురం, కడలూరు, కారైక్కాల్ సహా 16 కోస్తా జిల్లాల్లో ఏప్రిల్ 12 నుంచి జూన్ 14 అర్ధరాత్రి వరకు చేపల సంతానోత్పత్తి కాలంగా పరిగణించి చేపల వేటపై నిషేధం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. రెండు రోజుల్లో ఈ నిషేధ కాలం ముగియనుండటంతో మరపడవల్లో పది నాటికల్ మైళ్ల దూరం దాటి చేపలువేటాడే మత్స్యకారులు గురువారం వేకువజామునే సముద్రంలోకి బయలుదేరనున్నారు. గత రెండు నెలలకుగా పైగా తీరాలకే పరిమితమైన మరపడవలన్నింటికీ మరమ్మతు చేసి, పెయింటింగ్ చేసి సిద్ధం చేశారు.. ఈ నేపథ్యంలో నగరంలోని కాశిమేడు, నొచ్చికుప్పం, అయోధ్య కుప్పం ప్రాంతాల జాలర్లు తమ మరపడవల్లో వారానికి సరిపడా సామగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు. సముద్రంలో పట్టే చేపలను నిల్వ చేయడానికి మరపడవలలోను ఐస్ స్టోరూమ్‌ల్లో టన్నుల కొద్దీ ఐస్ నిల్వ చేస్తున్నారు.అదే విధంగా వారం రోజులకు సరిపడా తాగునీటిని ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నింపుకుంటున్నారు. ఇక చేపలు పట్టేందుకు అవసరమైన వాటిని, కొత్త వలలను పడవల్లోకి చేరుస్తున్నారు. వంట కోసం కిరణా సరకులు, వంట పాత్రలను కూడా మత్స్యకారులు పడవల్లో నిల్వ చేశారు. అన్ని సిద్ధం చేసిన తర్వాత ప్రతి మరపడవలోనూ జాతీయ జెండా కట్టి బయలుదేరటానికి సిద్ధమయ్యారు. ఇక కొత్తగా తయారు చేసిన మరపడవలకు బుధవారం సాయంత్రం జాలర్లు ప్రత్యేక పూజలు కూడా చేశారు. చెంగల్పట్టు జిల్లా కానత్తూరురెడ్డి కుప్పం నుంచి ఇడైకళి నాడు కుప్పం వరకు 36 జాలర కుప్పాల్లో 7500 మందికి పైగా మత్స్యకారుల కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ కుప్పాలకు చెందిన 80 వేల మందికిపైగా మత్స్యకారులు చేపలు పట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా జాలర్ల సంఘాల నాయకులు మాట్లాడుతూ రెండు నెలల విరామం అనంతరం చేపలవేటకు వెళ్తుండటంతో ఈ సారి పుష్కలంగా చేపలు లభించే అవకాశాలు ఉన్నాయన్నారు.



చెన్నై కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది చేత బుధవారం ఉదయం బాల కార్మికుల బానిసత్వ నిరోధక ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ ప్రియా

అన్నా అరివాలయంలో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్న రాజ్యసభ డీఎంకే పక్ష నాయకుడిగా నియమితులైన తిరుచ్చి శివా, ఎంపీలు విల్సన్, ఎం. షణ్ముగం





ఐసీఎఫ్‌ను పరిశీలిస్తున్న హుస్సేన్

ఐసీఎఫ్‌ను సందర్శించిన హుస్సేన్

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ జటోతు మంగళవారం చెన్నైలోని 'ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ' (ఐసీఎఫ్)ను సందర్శించారు. ఐసీఎఫ్ జనరల్ మేనేజర్ యు.సుబ్బారావుతో భేటీ అయిన ఆయన ఐసీఎఫ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐసీఎఫ్‌ను పరిశీలించారు. వందే భారత్ రైలు, వందే మెట్రో తదితర బోగీల తయారీ కూడా సందర్శించారు. ఈ సందర్భంగా ఐసీఎఫ్ ఉన్నతాధికారులు ఆయనకు వివరాలు వెల్లడించారు.

'రామచంద్ర వర్సిటీ' విద్యార్థుల అరుదైన ఘనత

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): 'శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్' విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది అరుదైన రికార్డు సాధించారు. ఆ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన 1240 మంది 54 సెకన్ల పాటు భుజంగాసనం వేసి ఘనత సాధించారు. దీనిని గుర్తించిన 'వరల్డ్ రికార్డ్స్ యూనియన్' సంస్థ సర్టిఫికెట్ అందజేసింది. ఆ సంస్థ మేనేజర్ క్రిస్టఫర్ టేలర్ బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ మైండ్ బాడీ మెడిసిన్ అండ్ లైఫ్ సైన్సెస్ హెచ్‌వోడీ డాక్టర్ డీజీ మాతంగి, ప్రొ వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ మహేష్ వాకమూడి, ప్రొఫెసర్ నాగరాజన్, డాక్టర్ టీకే పార్థసారథి, డాక్టర్ కవితా మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ ప్రదానోత్సవ దృశ్యం



సభా వేదిక వద్ద కోలాహలం



వేదిక ముందు నందమూరి, నారా కుటుంబ సభ్యులతో హీరో రామ్‌చరణ్

చంద్రబాబు అనే నేను..

ప్రభంజనమై మేమూ..

ప్రజాతీర్పునకు పట్టాభిషేకమైంది. జనం ప్రభంజనమై పండుగలా కదిలింది. అభిమాన కోలాహలం నడుమ కేసరపల్లి జయకేతనమై ఎగరగా, గన్నవరం జనవరమై జేజేలు పలికింది. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అనే మాటతో అభిమాన సంబరాలు అంబరాన్నంటాయి. కేసరపల్లిలో బుధవారం ఉదయం జరిగిన టీడీపీ కూటమి ప్రమాణస్వీకార మహోత్సవానికి అతిరథ మహారథులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

కేసరపల్లిలో ఘనంగా టీడీపీ కూటమి మహా పట్టాభిషేకం

బస్సెక్కిన అభిమానం









చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండగా నందమూరి రామకృష్ణ భావోద్వేగం, బాలకృష్ణ, భువనేశ్వరి అనురాగం, సభావేదిక వద్ద నాగలితో ఓ రైతు ప్రదర్శన



వేదికపై బాలకృష్ణ, రజనీకాంత్ దంపతులు, చిరంజీవి



జనసేన, టీడీపీ, బీజేపీ స్టిక్కరింగ్ స్కూటర్లపై వినూత్నంగా..